దేశం గర్వపడే దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం దేశం గర్వపడే మహాక్షేత్రంగా వెలుగొందుతున్నదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు మహాప్రసాదంతోపాటు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించారు. స్వర్ణగిరి దేవాలయం ప్రాచీన సంస్కృతి వాంగ్మయం ఉట్టిపడేలా అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో నిర్మించారని, ఈ దేవాలయం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధికెక్కుతుందని చెప్పారు. - యాదగిరిగుట్ట

కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి సన్మానమెందుకు?

- ట్విటర్‌లో మాజీ మంత్రి కేటీఆర్ నిలదీత

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఎందుకు సన్మానించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టబోమని చెప్పినందుకా? అమృత్ కుంభకోణంలో నీ బావమరిదిని కాపాడుతున్నందుకా? పొంగులేటి ఇంట్లో జరిగిన ఈడీ సోదాల్లో వివరాలు బయటకు రాకుండా చేసినందుకా? కేసులు పెట్టకుండా అడ్డుకున్నందుకా? అంటూ ఎక్స్‌వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు.

కాళేశ్వరం ద్వారా సాగునీరివ్వండి

- సర్కారు భేషజాలకు పోవద్దు
- బీఆర్ఎస్‌ను బద్నాం చేయొద్దు
- రైతులకు అన్యాయం చేయొద్దు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ కుంగుబాటు పేరిట బీఆర్ఎస్‌ను బద్నాం చేయడం ఆపి, భేషజాలకు పోకుండా కాళేశ్వరం ద్వారా రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా చిన్నపాటి మరమ్మతులు ఉంటే వాటిని పూర్తిచేసి నీటిని విడుదల చేయాలని కోరారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లలో నీటిని నిల్వ చేసి, వెంటనే ప్రాజెక్టులన్నింటినీ నింపాలని సూచించారు. మల్లన్నసాగర్, ఎల్లంపల్లి, కొండపోచమ్మ, రంగనాయక సాగర్‌ను రిజర్వాయర్లను నింపి యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ ఫేజ్ -2 ద్వారా కూడా నీటి సరఫరాకు అనుకూలంగానే ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్‌పై కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. బద్నాంలు బంద్‌పెట్టి ప్రజలకు మేలుచేసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును మనుగడలోకి తీసుకురావాలని కోరారు. రైతు కోణంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించాలని సూచించారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి అవమానం

- బతుకమ్మను అవమానించిన కాంగ్రెస్ నేతలకు ఏ శిక్ష వేస్తారో
- సీఎం రేవంత్ జవాబు చెప్పాలి
- ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా ఉద్యమతల్లిని నిలుపుకుంటాం
- తెలంగాణతల్లిపై జీవో జారీ చేయడం ఘోరాతిఘోరం
- నేడు జాగృతి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ బతుకమ్మలను ఎత్తుకొని శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్సీ కవిత

> కేసీఆర్‌ది విశాలతత్వం. రేవంత్‌రెడ్డిది సంకుచితత్వం. చరిత్రలో కొన్ని నల్ల పేజీలు రేవంత్ పేరు మీద చిరస్థాయిగా నిలిచిపోతాయి.
> - కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవమైన బతుకమ్మను అవమానిస్తూ, కించపరుస్తూ మాట్లాడిన మంత్రులు, కాంగ్రెస్ నాయకులకు ఏ శిక్ష వేస్తారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమైక్యాంధ్రను కోరుకున్న కాంగ్రెస్ నాయకుల వాదనలనే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నేతలు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారికి కాంగ్రెస్ ప్రయోజనాలే తప్ప తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యం కాదని దుయ్యబట్టారు. శుక్రవారం ఆమె బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ, సోనియాగాంధీ బతుకమ్మను ఎత్తుకొని తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారని, ఎన్నికల సమయంలో ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీ కూడా బతుకమ్మను ఎత్తుకొని శుభాకాంక్షలు చెప్పారని గుర్తుచేశారు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలకు బతుకమ్మ గుర్తుకొస్తుందని, ఓట్ల కోసం ఎన్ని ఆటలైనా ఆడుతారని మండిపడ్డారు. ఎన్నికల తర్వాత బతుకమ్మ ఎవరిదని, తెలంగాణతల్లి చేతిలో బతుకమ్మ ఎందుకు ఉండాలని కాంగ్రెస్ నేతలు వెర్రిప్రశ్నలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించారని గుర్తుచేశారు. బతుకమ్మను తాము విశ్వవ్యాప్తం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని మరుగున పడేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు.

దేశంలో ఏ విగ్రహానికైనా జీవో జారీ చేశారా?

తెలంగాణతల్లి రూపాన్ని ఎలా మారుస్తారని సీఎం రేవంత్‌రెడ్డిని కవిత ప్రశ్నించారు. 'దేశంలో అనేక విగ్రహాలున్నాయని, ఆయా నాయకుల మీద ఉన్న గౌరవభావంతోనే వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నామని, అదేవిధంగా ఉద్యమ సమయంలో కూడా తెలంగాణతల్లి విగ్రహాలను కూడా వేలాదిగా ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. దేశంలో భరతమాత విగ్రహాలకు కేంద్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందా? తెలంగాణలో మాత్రం కొత్త విగ్రహాన్ని పెట్టి ఈమే మీ తల్లి, ఎవరైనా ఇదే విగ్రహం పెట్టాలి. వేరే విగ్రహం పెడితే కేసులు పెడుతామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఎన్నడూ భరతమాతపై గెజిట్ ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణతల్లిపై గెజిట్ ఇవ్వడం దారుణం... ఘోరతి ఘోరమైన చర్య' అని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

> రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణతల్లిపై గెజిట్ ఇవ్వడం దారుణం. ఘోరతి ఘోరమైన చర్య. ఎన్ని జీవోలు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా ఊరేగించి మరీ మా ఉద్యమతల్లిని నిలుపుకుంటాం. తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో తెలంగాణతల్లి విగ్రహాలను ఆవిష్కరించుకుంటాం.
> - కల్వకుంట్ల కవిత

రేవంత్‌రెడ్డికి ఎందుకంత భయం?

తెలంగాణతల్లి రూపాన్ని మార్చడానికి ప్రజల ఆమోదమే ఉంటే జీవోతో పనేమున్నది? కేసులు పెడుతామని బెదిరించాల్సిన అవసరం ఏమున్నదని కవిత ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకింత పిరికితనమని నిలదీశారు. విగ్రహాన్ని కూడా రహస్యంగా తయారు చేయించారని విమర్శించారు. అంత రహస్యంగా విగ్రహాన్ని రూపొందించడానికి ఇదేమైనా ఫ్యూడల్ వ్యవస్థనా, నాజీ ప్రభుత్వమా? అని మండిపడ్డారు. ప్రభుత్వ వేడుకల్లో సైతం తెలంగాణకు సంబంధం లేని పాటలు పాడుతున్నారని, తెలంగాణలో ఎంతోమంది జానపద కళాకారులు ఉంటే.. ఒక్క కళాకారుడు కూడా పాట పాడటానికి దొరకలేదా? పాడటానికి ఒక్క తెలంగాణ పాట దొరకలేదా? అని నిలదీశారు.

ఆంధ్రా అనుకూల వ్యక్తి నీటిపారుదల శాఖ కార్యదర్శి

నీళ్ల కోసం పోరాటం చేసిన తెలంగాణలో, ఏపీకి అక్రమంగా నీళ్లు మళ్లించడానికి జీవోలు జారీ చేసిన అధికారిని సలహాదారుగా నియమించుకోవడాన్ని కవిత తప్పుబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకో టీఎంసీ నీటిని కృష్ణానది నుంచి ఎత్తిపోయడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కాలంలో ఆదిత్యానాథ్‌దాస్ జీవోలు జారీ చేశారని, అలాంటి వ్యక్తిని తెలంగాణ సాగునీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించడం ఎవరి ప్రయోజనాల కోసమని నిలదీశారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సాంస్కృతిక విధ్వంసం, తెలంగాణతల్లి రూపం మార్చడంపై తెలంగాణ జాగృతి తరపున పోరాటాలు సిద్ధమవుతున్నామని కవిత వెల్లడించారు. అధికారిక వేడుకల్లో విష సంస్కృతిని ప్రవేశపెట్టి తెలంగాణ పాటలు కాకుండా వేరే పాటలు పాడించడం వంటి అంశాలపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కవులు, కళాకారులు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు, ఆయా రంగాల ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు.

రాహుల్‌జీ..తెలంగాణపై రేవంత్ దాడిపై మౌనమేల?

'రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎలాంటి పాత్ర పోషించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు తెలంగాణ ఆనవాళ్లను ధ్వంసం చేస్తున్నారని, తెలంగాణతల్లి విగ్రహం చేతిలో నుంచి బతుకమ్మను చెరిపివేశారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రేవంత్ మా వారసత్వాన్ని నాశనం చేస్తుంటే, రాహుల్‌జీ మీరెందుకు మౌనంగా ఉన్నారు?' అంటూ శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఫొటోల కోసం బతుకమ్మ ఆడే రాహుల్, సోనియా, ప్రియాంకాగాంధీ మౌనాన్ని వీడాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు జై బతుకమ్మ.. ఎన్నికలైన తర్వాత నై బతుకమ్మ..

- ఇదే కదా రేవంత్ తీరు: హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): 'ఎన్నికల ముందు జై బతుకమ్మ.. ఎన్నికలైన తర్వాత నై బతుకమ్మ' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఎక్స్ వేదికగా చురకలంటించారు. 'బతుకమ్మను పక్కనబెట్టు.. సోనియమ్మకు జై కొట్టు..ఇదే కదా అసలైన మార్పు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1978లోబతుకమ్మ వేడుకల్లో ఇందిరాగాంధీ పాల్గొన్న ఫొటో, గత ఎన్నికల వేళ రాహుల్‌గాంధీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న చిత్రంతో పాటు బతుకమ్మను ఎత్తుకున్న ప్రియాంక, సోనియాగాంధీ ఫొటోలను ట్యాగ్ చేశారు.

అమరులకు వద్దిరాజు నివాళి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): పార్లమెంట్‌పై దాడి ఘటనలో అమరులైనవారికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నివాళులర్పించారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో అమరుల చిత్రాల వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు.

గిరిజన బిడ్డకు 15వ ర్యాంకు

- యూపీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటిన ప్రేమ్‌కుమార్

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 13: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం మెగులాన్‌పల్లి తండా జీపీ పరిధిలోని దంకుడుమోరి తండాకు చెందిన సభావత్ ప్రేమ్‌కుమార్ ఇండియా ఎకానమిక్ సర్వీస్ (ఐఈఎస్)కు ఎంపికయ్యారు. యూపీఎస్సీ గురువారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో 15వ ర్యాంకు సాధించాడు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆదిలాబాద్‌లోని జవహర్ నవోదయ పాఠశాలలో చదివిన ప్రేమ్‌కుమార్.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తొలి ప్రయత్నంలోనే 15వ ర్యాంకు సాధించి ఇండియా ఎకనామిక్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, తల్లిదండ్రుల కష్టాన్ని చూశాక మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో నిర్దిష్ట ప్రణాళికతో చదివానని ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఐఈఎస్‌కు ఎంపికై తన తల్లిదండ్రుల కలను సాకారం చేశానని చెప్పారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

కేంద్రానికి బీసీ సంఘాల డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): జనాభా గణనలో కులగణన చేపట్టాలని, లేదంటే రైతుల ఉద్యమ తరహాలో ఢిల్లీని ముట్టడిస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి కేంద్రాన్ని హెచ్చరించారు. బీసీలపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామని, అయితే కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేయాలని సిఫారసు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. నిర్లక్ష్య పోకడకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ పరువు నష్టం కేసు విచారణ 6కు వాయిదా

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పురువు నష్టం కేసు విచారణ జనవరి 6కు వాయిదా పడింది. శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా ప్రతివాదుల తరపు న్యాయవాదులు సిటీ సివిల్ కోర్టుకు వకాలత్‌ను సమర్పించారు. 'డెక్కన్ హెరాల్డ్' పత్రిక తరపున ఎవరూ హాజరు కాకపోవడంతో తదుపరి వాయిదా నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీచేసింది.

కొండా సురేఖపై కేసు

- 9న విచారణకు హాజరుకావాలన్న కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖ తనపై అనుచిత వ్యాఖ్యలు చేసి, పరువుకు భంగం కలిగించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌ను న్యాయస్థానం అంగీకరించింది. ఆమెపై కేసు నమోదు చేయాలని నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కేటీఆర్ పిటిషన్‌పై ఇప్పటికే సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేయడంతోపాటు కొండా సురేఖ వ్యాఖ్యలపై పత్రికలు, టీవీ చానళ్లల్లో వచ్చిన వార్తా కథనాలను పరిశీలించిన కోర్టు.. వచ్చేనెల 9న విచారణకు హాజరుకావాలని ఆమెకు సమన్లు జారీ చేసింది.

మోహన్‌బాబుకు బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): విలేకరిపై దాడి కేసులో సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు చుక్కెదురైంది. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. విలేకరిని హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు మోహన్‌బాబుపై తీవ్రమైన అభియోగాలు వచ్చినందున బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు నిమిత్తం ఫిర్యాదుదారు ఎం రంజిత్ కుమార్‌కు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

ఉద్యమతల్లే ముద్దు.. రుద్దేతల్లి వద్దు

తెలంగాణతల్లి రూపు మార్పు సాంస్కృతిక విధ్వంసానికి తొలి హెచ్చరిక ● ఉద్యమానికే ఉద్వేగాలు.. సర్కార్లకు అక్కర్లేదు: జూలూరు

- తెలుగుజాతి పేరుతో ఆనాడు... బహుజనతల్లి పేరుతో నేడు మోసం
- రాజకీయ జెండాల పేరుతో తల్లిని మార్చడం మంచిది కాదు
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'ఉద్యమతల్లే ముద్దు... బలవంతంగా రుద్దేతల్లి వద్దే వద్దు' అని ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ స్పష్టంచేశారు. తల్లి రూపు మార్పు తెలంగాణ సాంస్కృతిక విధ్వంసానికి తొలి ప్రమాద హెచ్చరిక వంటిదని అభిప్రాయపడ్డారు. ఉద్యమ ఉద్వేగాల్లోంచి పుట్టిన తల్లికి ఉత్తర్వులతో పనిలేదని, ఆ మాటకొస్తే భరతమాతకు ఏ ఉత్తర్వులు ఉన్నాయని ప్రశ్నించారు. తెలుగుజాతి పేరుతో ఆనాడు.. బహుజనతల్లి పేరుతో ఈనాడు జరిగేదంతా పచ్చి మోసం అని చెప్పారు. ఏ బహుజనతల్లికి కిరీటాలు లేవో చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణతల్లి రూపు మార్పు వెనుక అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దాటవేసేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ఎత్తుగడగా అనుమానించాల్సిందేనని ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

> 1969, అంతకన్నా ముందే తల్లిభావన ఉన్నది. చిత్రకారులు, శిల్పులు రూపాలను ఇచ్చారు. ఒక విగ్రహాన్ని కూడా ఆవిష్కరించుకున్నారు. మరి, ఆ రూపాలు ఉండగా మలిదశ ఉద్యమానికి మరోరూపు అవసరం ఏమొచ్చింది?

మీరన్నది నిజమే. ఆయా సందర్భాల్లో తల్లులకు రూపాలు ఇచ్చి కొలిచిన మాట వాస్తవమే. తుదిదశ తెలంగాణ ఉద్యమంలో రూపుదిద్దుకున్న తల్లి తెలంగాణ అంతటా పరివ్యాప్తమైంది. ఇవ్వాళ తెలంగాణతల్లి విగ్రహం లేని ఊరు దాదాపుగా లేదంటే అతిశయోక్తి కాదు. 2006 నుంచి 2014 దాకా తెలంగాణ ప్రజలందరి గుండెల్లో నిలిచిపోయిన రూపం అన్నది నిర్వివాదాంశం. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విగ్రహాలను ప్రజలు జేఏసీలుగా ఏర్పడి స్వచ్ఛందంగా ప్రతిష్ఠించుకున్నారు. ఆ విగ్రహాలను ఒక పార్టీకి ఆపాదిస్తరా?

> బతుకమ్మ తల్లిచేతిలో లేకపోతే అసలు తల్లేకాకుండా పోతుందా?
>
> బతుకమ్మకు వందల ఏండ్ల చరిత్ర ఉన్నదని ఆచార్య బిరుదురాజు రామరాజు చారిత్రక, జానపద ఆధారాలను ఏనాడో చెప్పారు. తెలంగాణకు తలమానికమైన పండుగ. శ్రామిక మహిళల సాహిత్యంతో కలగలసిన పండుగ. బతుకమ్మను అవమానించడం అంటే తెలంగాణ మూలాలను అవమానించడమే. అందుకు కాంగ్రెస్ నాయకులు తెగబడుతున్నరు.

తెలంగాణలో మెజారిటీ బహుజనులు అసలు బతుకమ్మే ఆడరని అంటున్నారు. దీనిపై మీరేమంటారు?

ఈ ప్రశ్న ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి వేయండి. వాళ్లూ బతుకమ్మ ఆడినట్టు ఫొటోలను ట్వీట్ చేసుకున్నారు. వాటిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బయటపెట్టారు. తెలంగాణ ఉద్యమం, సంస్కృతితో ఏమాత్రం మమేకం కానివాళ్లు, సంస్కృతితో సంబంధం లేనివాళ్లు పరాయి మూకల కిరాయిదారులు చెప్పే మాటలుగానే భావించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణతల్లి విగ్రహ పీఠంలో ఉద్యమ పిడికిళ్లు, తల్లిని పడిపోనీయకుండా పట్టుకున్న చేతుల దగ్గరి నుంచి జొన్నకర్రల దాకా సర్వం తెలంగాణ కాదంటారా?

ఏ తల్లీ తన పిల్లల చేతులను తొక్కుకుంటూ నిలబడాలని కలలో కూడా కోరుకోదు. తన ప్రాణం పోయినా సరే తన పిల్లలు బాగుండాలని తల్లి పరితపిస్తది. జొన్నపంట తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనది కాదు. మహారాష్ట్రలో నంబర్ వన్, తెలంగాణలో 8వ స్థానం. తెలంగాణ అంటే బతుకమ్మ కదా. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను ఎందుకు వేరు వేశారు? బతుకమ్మను వేరు చేయడం అంటే బతుకునే లేకుండా చేయడం. అస్తిత్వపు ఆనవాళ్లు లేకుండా చేయడం. నాడు 'తెలుగుజాతి మనది నిండుగ వెలుగుజాతి మనది' లాంటి సినిమా పాటలతో తెలంగాణ అస్తిత్వం లేకుండా చేయాలని చూశారు. ఇవ్వాళ తెలంగాణ నుంచి బతుకమ్మను లేకుండా చేసి అసలు మనకు సంస్కృతే లేకుండా చేయాలని ఇంత మోసానికి ఒడిగట్టారు. బతుకమ్మను తీసేసి పార్టీ సింబల్ పెడ్తరా? ఎక్కడైనా ఇలా చేస్తరా? ఇంత దారుణమా?

'తెలుగుజాతి మనది..నిండుగ వెలుగు జాతి మనది' అనే పాట రాసింది తెలంగాణ బిడ్డే కదా? అప్పుడే ఉమ్మడి రాష్ట్రం కుట్ర అన్నారు. ఇప్పుడూ అలా ఎలా అంటారు?

అవును. 'మనవేలుతో మన కన్నునే పొడవాలి' అనే కుతంత్రం అప్పుడూ ఉన్నది. ఇప్పుడూ కొనసాగుతున్నది. రాజకీయ మూలాల నేపథ్యాలను పరిశీలిస్తే తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జీర్ణించుకోలేని శక్తుల కుట్రలు ఇందులో దాగున్నాయేమోననే అనుమానం కలుగుతున్నది. 'తల్లా పెళ్లామా?' సినిమాలో సినారె చేత ఆ పాట రాయించిన తరువాత తెలంగాణ సమాజం సినారె అంతటివారినే ఏ విధంగా చూసిందో అప్పటివాళ్లకు తెలుసు. ఇప్పటికీ ఉన్న తల్లిరూపాన్నే మార్చడం అంటే తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి జారీ చేసిన తొలి ప్రమాద హెచ్చరిక అనే ఆందోళన కలుగుతున్నది.

గత ప్రభుత్వం విస్మరించింది కనుకనే మేం తెలంగాణ తల్లిని గౌరవించాం అని ప్రభుత్వం చెప్పింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో వివాదం ఏమున్నది?

'తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి' అన్నట్టే ఉన్నది ఈ వాదన. ఎక్కడైనా ఉద్యమానికి భావోద్వేగం ఉంటుంది కానీ, ప్రభుత్వానికి ఉండదు. మలిదశ తెలంగాణ ఉద్యమ భావోద్వేగంలోంచి పుట్టిన తల్లిని కాదని, జీవోలు ఇచ్చిన తల్లిని మాత్రమే కొలవాలి అంటే ఇంతకన్నా దారుణం మరొకటి ఉంటుందా? తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర అవతరణ అనంతర కాలంలో తెలంగాణతల్లిని కొలవడంలో ఎక్కడ తక్కువ జరిగింది?

రాజకీయాభిప్రాయాలతో ప్రజలకేం సంబంధం?

నిజమే. రాజకీయాలు, రాజకీయ పార్టీలతో ప్రజలకు సంబంధం ఉండాల్సిన పనిలేదు. కానీ, నిన్న ఒక ప్రభుత్వం ఉన్నది. ఇవ్వాళ ఈ ప్రభుత్వం ఉన్నది. రేపు మరో ప్రభుత్వం వస్తుంది. అదేదో నాటకంలో ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు, మూడో కృష్ణుడు అన్నట్టు ఒక టోతల్లి, రెండో తల్లి, మూడో తల్లి ఉండదు. తెలంగాణతల్లి ఒక్కరే. అది ఉద్యమంలోంచి ఉద్భవించిన తల్లి. రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని మార్చినప్పుడల్లా తల్లి మారుతుందా? ఇదేం ఖర్మ మనకు.

> ఆరాధించే తల్లికి కిరీటం, నగలు ఉండాల్సిందేనా?
>
> ఎందుకు ఉండకూడదు. ఏ బహుజన తల్లికి, దేవతకు కిరీటం లేదో చెప్పండి. ఈ లెక్కన నల్లపోచమ్మ, కొండపోచమ్మ, కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ, గొల్లకేతమ్మ.. ఇలా బహుజన దేవతలకు ఉన్న కిరీటాలను తొలగిస్తారా? ఆ పనికి ప్రభుత్వమే పూనుకుంటుందా? బహుజన దేవుళ్లకు కిరీటాలు, నగలు ఉండకూడదా? కాసేపు ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణతల్లి విగ్రహాన్నే బహుజనులకు ప్రతీక అని అనుకుంటే.. ఏ గ్రామీణతల్లి, చెల్లి, అక్క, అవ్వ చేతిలో ఏ పనిముట్టులేకుండా ఉంటుందా? పని సంస్కృతిని, జీవకారుణ్యానికి ప్రతీకగా ఉండకూడదా? చిట్యాల ఐలమ్మ చేతిలో కర్రనెందుకు పెట్టుకున్నాం? కుమ్రంభీముడి చేతిలో తుపాకీ ఎందుకు పెట్టుకున్నాం? అంటే వారి పోరాట నేపథ్యాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలని పెట్టుకున్నాం. ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణ విగ్రహంలో ఏమీ లేదు. బతుకమ్మను తీసేయడం ఆడబిడ్డలను, సంస్కృతిని అవమానించడమే.

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ Special Interview

ఎంతమందిని జైల్లో వేస్తవ్ రేవంత్‌రెడ్డీ?

- ప్రశ్నించేవాళ్లందరినీ జైల్లో వేయాలని కుట్ర
- 60 లక్షల మందిని అరెస్టు చేసే దమ్ముందా?
- కేటీఆర్‌ను అరెస్టు చేస్తే రాష్ట్రం అల్లకల్లోలమే
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ జైల్లో వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నువ్వు జైలుకు వెళ్లినందున కేటీఆర్‌ను కూడా జ